క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో విజయదుర్గాదేవి

తగరపువలస: స్థానిక బైపాస్‌రోడ్డులోని శ్రీ విజయదుర్గాదేవి, విఘ్నేశ్వర, సుబ్రహ్మణ్యేశ్వర ఆలయ 12వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఆలయ ట్రస్టీ రాజగిరి కుసుమహర ఆధ్వర్యంలో అర్చకులు వేకువజాము నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారి ఆలయంతో పాటు వెంకటేశ్వరమెట్టపై శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు మధ్యాహ్నం అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

యువకుడిని కాపాడిన లైఫ్‌గార్డ్స్



కాపాడిన యువకుడితో లైఫ్‌గార్డ్స్

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో ఓ యువకుడు కొట్టుకుని పోతుండగా లైఫ్‌గార్డ్స్ ప్రాణాలు కాపాడిన సంఘటన చోటు చేసుకుంది. మధురవాడకు చెందిన నలుగురు యువకులు శనివారం సాయంత్రం సరదాగా గడిపేందుకు ఇక్కడి బీచ్‌కు చేరుకున్నారు. కాసేపు వీరు సరదాగా గడిపి బీచ్‌లో స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. ఈ క్రమంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండటం వలన వీరిలో ఎం. శ్రీకాంత్ అనే యువకుడు కొట్టుకుని పోతుండగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డ్స్ ఎస్. నూకరాజు, జి.అప్పన్న, చందు, గురుమూర్తి, దేవ యువకుడిని గమనించి, సురక్షితంగా తీరానికి తీసుకుని వచ్చారు. వీరికి మెరైన్ పోలీసులు అరుణ, రవి కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. యువకుడిని కాపాడిన లైఫ్‌గార్డ్స్‌ను మెరైన్ సీఐ శ్రీనివాసరావు అభినందించారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం రేపు

మధురవాడ: జీవీఎంసీకి ప్రధాన నీటి వనరు అయిన ఆనందపురం మండలం గోస్తనీ హెడ్ వాటర్ వర్క్స్ నుంచి మధురవాడ పరిసర ప్రాంతాలకు తాగునీరు సరఫరా చేసే 700ఎంఎం డయా పైపులైన్ మారికవలస ఎంఆర్‌ఎఫ్ షోరూం దగ్గర లీకవుతోంది. దీంతో మరమ్మతుల నిమిత్తం ఈ నెల 2వ తేదీ (సోమవారం) సంబంధిత ప్రాంతాల్లో నీటి సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు జీవీఎంసీ తాగునీటి విభాగం కార్యనిర్వాహక ఇంజినీర్ సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ 6వ వార్డులోని కొమ్మాది విలేజ్, ఎంఎస్ఆర్ లే అవుట్, సాయిప్రియ లే అవుట్, సంపత్ నగర్, లక్ష్మీవానిపాలెం ఎస్సీ కాలనీ, బక్కన్నపాలెం, రేవళ్లపాలెం, పీఎం పాలెం, అశోక్‌నగర్, తులసి నగర్‌లలో నీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు. 7వ వార్డులోని చంద్రంపాలెం, కళానగర్, కృష్ణానగర్, ఎన్‌జీజీవోస్ కాలనీ, వుడా కాలనీలలో నీటి సరఫరా ఉండదని, ప్రత్యామ్నాయంగా వాటర్ ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తామని తెలియజేశారు.

కల్యాణ మండపానికి శంకుస్థాపన

మధురవాడ: జీవీఎంసీ ఏడో వార్డు పరిధి చంద్రంపాలెం ఎన్జీఓ కాలనీ సమీపంలో కొత్తగా నిర్మించనున్న కల్యాణ మండపానికి కార్పొరేటర్ పిల్లా మంగమ్మ శనివారం శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ ఈ కల్యాణ మండపం ఏర్పాటు జరిగితే ఈ ప్రాంత ప్రజలకు ఎంతో సదుపాయంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో చంద్రంపాలెం ప్రజలు, గ్రామ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పదవీ విరమణ చేసిన జీవీఎంసీ ఉద్యోగులకు వీడ్కోలు



పదవీ విరమణ చేసిన ఉద్యోగులతో జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణ

అల్లిపురం: ఉద్యోగ విరమణ చేసిన ప్రతి ఉద్యోగి శేష జీవితం ఆనందంగా గడపాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి అన్నారు. శనివారం జీవీఎంసీలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించి ఉద్యోగ చేసిన 12 మంది అధికారులు, ఉద్యోగులను ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్లు పద్మజ, అప్పలనాయుడుతో కలిసి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ కాలం మనతో విధులు నిర్వర్తించి నేడు విధులను విడిచి వెళుతున్నందుకు తోటి ఉద్యోగులందరికీ బాధ కలుగుతుందన్నారు.

పండగొచ్చింది

పద్మనాభంలో ఉత్సవ వాతావరణం • ఆరేళ్ల అనంతరం బంగారమ్మ పండగ • వీధులన్నీ విద్యుద్దీపాలతో కళకళ



పద్మనాభం జంక్షన్‌లో బంగారమ్మ ఆలయం

> పద్మనాభం గ్రామానికి పండగొచ్చింది. గ్రామ ఇలవేల్పు బంగారమ్మ ఉత్సవాన్ని ఆరేళ్ల అనంతరం ఘనంగా నిర్వహించనుండటంతో ఊరంతా పండగ శోభ సంతరించుకుంది. ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు జరగనున్న పండగకు 16 రోజుల ముందు నుంచే సంరంభం ప్రారంభమైంది.



పద్మనాభం జంక్షన్‌లో బంగారమ్మ విగ్రహం

పద్మనాభం: మండల కేంద్రం పద్మనాభంలో బంగారమ్మ ఉత్సవాలకు సన్నాహాలు ఘనంగా జరుగుతున్నాయి. గ్రామ ఇలవేల్పు బంగారమ్మ ఉత్సవాలను 2019 తర్వాత, మళ్లీ ఆరేళ్లకు నిర్వహిస్తున్నారు.

15న పసుపుకుంకుమలతో శ్రీకారం..

ఉత్సవాల చాటింపు దండోరాకు ముందుగా గత నెల 15వ తేదీన పద్మనాభం జంక్షన్‌లోని ముత్యాలమ్మకు పసుపు, కుంకుమలు సమర్పించారు. అనంతరం ఉత్సవాల నిర్వహణ గురించి గత నెల 17వ తేదీన దండోరా వేశారు. 25వ తేదీన ఉజిడి ఉత్సవం నిర్వహించారు. గ్రామాన్ని శుద్ధి చేశారు. దీనిలో భాగంగా ఉజిడి బండిని గ్రామంలో తిప్పారు. ఉత్సవాల నిర్వహణకు ఎటువంటి ఆటకం కలగకుండా ఉజిడి బండిపై ఏర్పాటు చేసిన బుట్టలో ములం కూర, అన్నంతో తయారు చేసిన ఆహారాన్ని పద్మనాభం జంక్షన్‌లోని బంగారమ్మ ఆలయం వద్దకు తీసుకు వచ్చి అమ్మవారికి నివేదించారు. 28న దేవర సంబరంతో బంగారమ్మ వారిని ఆహ్వానించి ఊరిలోకి తీసుకు వచ్చారు. కర్ర, గరిడీ సాము వంటి సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ప్రజలు సచివాలయం వద్దకు వెళ్లి అమ్మవారి ప్రతిరూపమైన పుట్ట వద్ద పూజలు చేశారు. తదుపరి పుట్ట మట్టిని పద్మనాభం గ్రామంలోని బంగారమ్మ ఆలయంలోకి తీసుకు వచ్చారు. 29వ తేదీన నిర్వహించిన చద్దన్నం అమ్మవారి ఉత్సవం ప్రత్యేకతను సంతరించుకుంది. 28వ తేదీ రాత్రి తొరిపిన చద్దన్నాన్ని 29న మహిళలు జిబ్బెల్లో చద్దన్నాన్ని పట్టుకుని పైకి కనిపించకుండా చీర కొంగులు కప్పి ఊరేగింపుగా సచివాలయం వద్ద ఉన్న అమ్మవారి ప్రతిరూపమైన పుట్ట వద్దకు వెళ్లి, అమ్మవారికి ప్రదక్షిణ చేసి నివేదించారు. ఐదు రోజుల నుంచి గ్రామంలో ఉన్న కొంతమంది దినచర్య, అలవాట్లు బట్టి వీరిపై వాలకాలు తెస్తూ ప్రజల్లో నవ్వులు పూయిస్తున్నారు.



పద్మనాభం గ్రామంలోని బంగారమ్మ ఆలయంలో అమ్మవారి ఘటాలు



పద్మనాభం గ్రామంలోని అమ్మవారి సతకం పట్టు

రేపు తొలేళ్లు.. మంగళవారం రథోత్సవం

జూన్ రెండో తేదీన తొలేళ్ల పండగ నిర్వహిస్తారు. దీనిలో భాగంగా అమ్మవారి ప్రతిమలైన కంచు, కుండ ఘటాలను ఊరేగిస్తారు. మూడో తేదీన వ్యవసాయ బండిని రథంగా తీర్చిదిద్ది గ్రామంలో మూడుసార్లు ఊరేగిస్తారు. గ్రామంలోని సతకంపట్టు నుంచి పోలీస్ స్టేషన్ వరకు మూడుసార్లు రథాన్ని ఊరేగిస్తారు. రథంపై పదిమంది ఆశీనులవుతారు. తాలాడు గురునాయుడు కత్తి చేత పట్టి రథంపై ముందు కూర్చుంటారు. తర్వాత అమ్మవారి కంచు ఘటాన్ని మోసే బుగత రాము రథంపై ఆశీనులవుతారు. తరవాత మిగతా ఎనిమిది మంది రథంపై ఆశీనులవుతారు. ఇదే రోజున పద్మనాభం జంక్షన్, గ్రామంలో ఉన్న బంగారమ్మ, పద్మనాభం పొలి మేరల్లో ఉన్న దుర్గాలమ్మ ఆలయాన్ని, పద్మనాభంలో ఉన్న పైడితల్లమ్మ ప్రతిరూపమైన ముసిడి చెట్టును దర్శించుకుని గ్రామస్తులు పూజలు చేస్తారు. నాల్గో తేదీన ముగింపు ఉత్సవం జరగనుంది. ఈ సందర్భంగా పద్మనాభం బ్రిడ్జి నుంచి జంక్షన్ వరకు, గ్రామంలో ఉన్న అన్ని వీధుల్లోను, అమ్మవారి ఆలయానికి లైటింగ్ ఏర్పాటు చేశారు. ఉత్సవాల నిర్వహణకు సుమారు రూ.10లక్షలు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. టెంట్లు, కుర్చీలు వంటి పాత్రల వంటి సామగ్రికి గిరాకీ ఏర్పడింది. బంధువుల రాకతో గ్రామస్తుల ఇళ్లు కళకళలాడుతున్నాయి.

ఇది మా కుటుంబీకుల అదృష్టం



పూర్వీకుల నుంచి బంగారమ్మ జంగిడీని మా కుటుంబీకులే మోయడం ఆనవాయితీగా వస్తోంది. గత నెల 26 నుంచి ఈ నెల మూడో తేదీ వరకు ఈ ఉత్సవం ఉంటుంది. గతంలో రెండు పండగలకు అమ్మవారిని మోశాను. ఇది అమ్మవారు మాకు కల్పించిన అదృష్టంగా భావిస్తున్నాను.

– బి.గురునాయుడు, పూజారి

కత్తి చేతపట్టి రథంపై ..



బంగారమ్మ ఉత్సవాల్లో భాగంగా ఈ నెల మూడో తేదీన గ్రామంలో రథం తిరుగుతుంది. రథం సతకం పట్టు నుంచి పోలీస్ స్టేషన్ వరకు మూడు సార్లు తిరుగుతుంది. రథంపై ముందు నేను కత్తి చేత పట్టి అధిష్టిస్తాను. తరవాత మిగతా తొమ్మిది మంది కూర్చుంటారు.

– టి.గురునాయుడు, పద్మనాభం

ఆస్పత్రి వ్యర్థాలు మళ్లీ చెరువులోకే..

తగరపువలస: సంగివలస ఎన్ఆర్ఐ ఆస్పత్రి వ్యర్థాలు మళ్లీ యథావిధిగా చిట్టివలస పెద్ద చెరువులోనే కలుస్తున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో రూ.6.50 కోట్లతో ఈ పెద్ద చెరువు బ్యూటిఫికేషన్ పనులు చేపట్టారు. అయితే, ఇప్పుడు కాలువను, చెరువును కలిపేయడంతో సమస్య మళ్లీ మొదటికే వచ్చినట్లయింది.

ఇదీ పరిస్థితి..

పూర్వం నుంచి ఇన్ ఫ్లోకు సంబంధించి నమ్మివానిపేట, సంగివలస తదితర గ్రామాల నుంచి గెడ్డల ద్వారా వచ్చే నీరు ఆదర్శనగర్ ఎర్రచెరువు, భీమిలి రోడ్డు నల్ల కోనేరు మీదుగా ఈ పెద్ద చెరువులో కలుస్తుండేది. తరువాత సంగివలసలో ఏర్పాటైన ఆస్పత్రి నుంచి మెడికల్ వ్యర్థాలను యాజమాన్యం శుభ్రం చేయకుండానే వదిలేయడంతో అవి చెరువులో కలవడంతో నీరు కలుషితమై దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో గత ప్రభుత్వం ఆస్పత్రి వర్థాలను చెరువులో కలవనీయకుండా పక్కగా ఒక కాలువను ఏర్పాటు చేసింది. ఈ కాలువ ద్వారా నీరు జీరుపేట వద్ద చప్టా మీదుగా బయటకు ప్రవహించవలసి ఉంది. ఇటీవల చిల్లపేట వద్ద నిర్మించిన ఎల్లమ్మ ఆలయం ముంపు నుంచి రక్షణగా కాలువ నీరు బయటకు రాకుండా ఆ గ్రామస్తులు డెబ్రిస్ వేసి అడ్డం పెట్టారు. గతంలో చిట్టివలస పెద్ద చెరువును నుంచి అవుట్ ఫ్లో కోసం బొగ్గురోడ్డులో ఉండే మదుములను అవతలి వైపు ఉన్న రియల్ ఎస్టేట్ యజమానులు శాశ్వతంగా మూసివేశారు. ప్రస్తుతం వర్షాలకు నీరు చెరువుపైకి ముంచెత్తుతున్న కారణంగా జీవీఎంసీ సిబ్బంది యంత్రాలతో జీరుపేట సమీపంలో కాలువను, చెరువును కలిపేశారు. దీంతో ఆస్పత్రి వ్యర్థాలతో చెరువు నీరు కలుషితం కావడంతో పాటు మళ్లీ దుర్గంధం సమస్య తలెత్తుతోందని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువు అవుట్ లెట్లు తెరవడంతో పాటు కాలువనీరు చెరువులో కలవనీయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.



చెరువు పక్క కాలువ నుంచి ప్రవహిస్తున్న ఆస్పత్రి వ్యర్థాలు



జీరుపేట వద్ద చెరువునీరు, కాలువ నీరు కలిసిపోతున్న ప్రదేశం

పోలీస్ బెటాలియన్‌లో నూతన నిర్మాణాలు ప్రారంభం

పీఎం పాలెం: బక్కన్నపాలెం ఏపీఎస్‌పీ పోలీస్ బెటాలియన్‌లో ఇటీవల నిర్మించిన బెటాలియన్ అసోసియేషన్ రూమ్‌ను, బెటాలియన్ గ్రౌండ్ డయాస్ రూమ్‌ను, లైబ్రరీని 16వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ కేవీ మురళీకృష్ణ శనివారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేజీహెచ్ మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.శిల్ప మురళీకృష్ణ ఆఫీసర్ల ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టును ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం 1వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు, స్థానిక ఇన్‌చార్జి అడిషనల్ కమాండెంట్ పి.సత్యం, అసిస్టెంట్ కమాండెంట్లు ఎస్.మురళీధర్, వి.నారాయణరావు, యూనిట్ మెడికల్ ఆఫీసర్లు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.



నూతన నిర్మాణాలను ప్రారంభిస్తున్న బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ తదితరులు

దూరదృష్టి గల సంఘసంస్కర్త అహల్యాబాయి

తగరపువలస: దూరదృష్టి గల గొప్ప సామాజిక సంఘసంస్కర్త రాణీ అహల్యాబాయి అని నాయకులు కొనియాడారు. అహల్యాబాయి 300వ జయంత్యుత్సవాలను ఆనందపురం మండల బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని పెద్దిపాలెంలో అహల్యాబాయి చిత్రపటంతో ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ మొఘలుల దాడుల్లో దెబ్బతిన్న సోమనాథ్, కాశీవిశ్వేశ్వర ఆలయాలను పునరుద్ధరించడమే కాకుండా అప్పట్లోనే రూ.16 కోట్లు ఖర్చు చేసి 12 జ్యోతిర్లింగాల క్షేత్రాలను రాణీ అహల్యాబాయి నిర్మించారన్నారు. వరకట్నానికి వ్యతిరేకంగా కఠిన చట్టాలు చేయడంతో పాటు మహిళలకు విద్యాహక్కు కల్పించిన నాయకురాలని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు పిల్లా విజయ, పీవీవీ ప్రసాదరావు, ఉప్పాడ అప్పారావు, సరిపల్లి రామ్మోహన్, ఉమ్మిడి సుజాత, కె.సునీత, పి.శ్రీనివాసరావు, కామేష్, మీసాల రాము, డీపీ రాజు తదితరులు పాల్గొన్నారు.



అహల్యాబాయి చిత్రపటంతో పెద్దిపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

అలరించిన నృత్య ప్రదర్శన



శిల్పారామం కళావేదికపై కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

పీఎం పాలెం: శిల్పారామంలో శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రదర్శించిన ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆద్యంతం అలరించాయి. ముందుగా ప్రదర్శించిన బుజ్జి బుజ్జి గణపయ్య.. జానపద డీజే గీతానికి ప్రదర్శించిన కోలాటం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జ్యోష్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో పలు కూచిపూడి నృత్యరీతులను కళాకారులు అద్భుతంగా ప్రదర్శించి, ఆకట్టుకున్నారు. అన్నమాచార్య కీర్తనలకు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ప్రేక్షకులను పరవశింపజేశాయి. కె.మురళీగోవింద్ నృత్య దర్శకత్వంలో కళాకారులు కుశల్, మోహన్, మౌనిక, భవ్యరిషక, రోహిత, ఐశ్వర్య, చైత్ర, దీపిక, తదితరులు పాల్గొన్నారు.

మానవతావాది కన్నారావు

తగరపువలస: చిట్టివలస ప్రాంత ప్రజలకే కాకుండా ఉత్తరాంధ్రలో వేలాది మందికి తలలో నాలుకలా మెలిగి, నిరంతరం సహాయ సహకారాలు అందించిన రంగూరి కన్నారావు పలువురికి ఆదర్శప్రాయుడని వక్తలు కొనియాడారు. కన్నారావు 50వ వర్ధంతి సందర్భంగా ఆయన వారసులు రంగూరి సీతారామదొర, శివగోపాల్, గిరిధర్, గణేష్ కన్నా, వరలక్ష్మికుమారి, శారద తదితరులు శనివారం ఎస్ఆర్ఎల్ ఫంక్షన్ హాలులో స్వర్ణోత్సవ సభ నిర్వహించి, ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు పునరుద్ధరించారు. ఈ సందర్భంగా కన్నారావు గురించి ఆహూతులకు తెలియచేశారు. ఆయన జీవించింది 43 ఏళ్లే అయినా ఆయన చేసిన సేవలు 50 ఏళ్లు గడిచినా ఈ ప్రాంత ప్రజలు మరచిపోలేదన్నారు. ఈ సందర్భంగా పేదలకు వస్త్రాలు, దుప్పట్లు, గొడుగులు, పాత్రలు పంపిణీ చేసి, అందరికీ విందు భోజనాలు ఏర్పాటు చేశారు. ట్రస్ట్ ద్వారా ఇకపై సేవా కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో సుంకర రామప్రసాద్, అలంక సాంబమూర్తి, అక్కరమాని రామునాయుడు, గిడుగు కామేశ్వరరావు, ఆదిమూలం నాగరాజు, మైలపల్లి షణ్ముఖరావు, కొప్పల రమేష్, పిట్ట సురేష్, కె.ఎస్.ఎం సుధాకర్, చేట్ల త్రినాధరెడ్డి, చింతగుంట శివ తదితరులు పాల్గొన్నారు.



కన్నారావు పేరుమీద పేదలకు వస్త్రదానం చేస్తున్న ఆయన వారసులు

పొగాకు అనర్థాలపై విద్యార్థులకు అవగాహన

మధురవాడ: పొగాకు, నికోటిన్ గల పదార్థాలు ఆరోగ్యానికి తీవ్రంగా హాని చేస్తాయని చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రవి తెలిపారు. పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా చంద్రంపాలెం హైస్కూల్లో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆయా పరిశ్రమలు తమ ఉత్పత్తులను అమ్ముకోవడానికి, యువతను ఆకర్షించే ప్రకటనలు, మోసపూరిత వ్యూహాల ద్వారా వాటికి బానిసలుగా మార్చేస్తున్నాయన్నారు. విద్యార్థులకు నికోటిన్, పొగాకు వల్ల కలిగే దుష్పరిణామాల గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించారు.



ప్లకార్డులు, బ్యానర్ ప్రదర్శిస్తున్న విద్యార్థులు

జర్నలిస్టుల నూతన కార్యవర్గం ఏర్పాటు

మధురవాడ: మధురవాడ జర్నలిస్టుల నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మధురవాడ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా అద్దంకి సాంబశివరావు, అధ్యక్షుడిగా తమ్మినీడి శ్రీనివాస్, కార్యదర్శిగా బసవబోయిన ఆనందరావు, కోశాధికారిగా కేటీ రామునాయుడు, ఉపాధ్యక్షులుగా నాగోతి నరసింహానాయుడు, పోలిమాటి సునీల్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా కెల్ల అభిరామ్, బాలు పాత్రో ఎన్నికయ్యారు. వారితో పాటు ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులను, గౌరవ సలహాదారులను, క్రమశిక్షణా కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మధురవాడ పరిసర ప్రాంతాలకు చెందిన జర్నలిస్టులు పాల్గొన్నారు.



నూతన కమిటీతో మధురవాడ జర్నలిస్టులు

సూపర్‌స్టార్ కృష్ణకు నివాళులు

తగరపువలస: సూపర్‌స్టార్ కృష్ణ 82వ జయంతి సందర్భంగా శనివారం జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు జీరుపేట వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన ఫొటోకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జీరు వెంకటరెడ్డి మాట్లాడుతూ తెలుగు సినీ చిత్రసీమలో కృష్ణ సినిమాలు ఒక ఒరవడి సృష్టించాయన్నారు.

ప్రమాదకరంగా మెట్ల మార్గాలు



గోస్తనీ నది వైపు మెట్ల మార్గం



వెంకటేశ్వరమెట్ట పోలీస్ అవుట్‌పోస్టు వైపు మెట్ల మార్గం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు బంగ్లామెట్టపైకి చేరుకునే మెట్ల మార్గాలు ప్రమాదకరంగా ఉన్నాయి. వెంకటేశ్వరమెట్ట పోలీస్ అవుట్‌పోస్టు సమీపం నుంచి ఒకటి, గోస్తనీనది వైపు మణికంఠ ఫ్యాక్టరీ ఎదురుగా మరో మెట్ల మార్గం ద్వారా బంగ్లామెట్ట వాసులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం ఈ రెండు మెట్ల మార్గాలు శిథిలమైపోయి ఉన్నాయి. అంతేకాకుండా ఈ మెట్ల మార్గానికి అడ్డంగా ఇంటింటా కుళాయి పైపులు ఉండటంతో రాకపోకలు సాగించేవారు తరచూ పడిపోతున్నారు. ప్రస్తుతం వర్షాలు కూడా కురుస్తున్నందున నాచుకట్టిన మెట్లపై నుంచి జారిపడటం సర్వసాధారణం అయిపోయింది. మెట్ల ప్రారంభంలో డ్రైనేజీలపై శిథిలమైన పలకలు మార్చి, మెట్లకు మరమ్మతులు చేపట్టాలని.. దిగేవారికి అనువుగా రెయిలింగ్ ఏర్పాటు చేయాలని బంగ్లామెట్ట వాసులు కోరుతున్నారు. వర్షాలు ఎక్కువగా కురిసే సమయంలో ఈ మెట్లపై నుంచి ప్రవహించే నీటి ప్రవాహం ఇళ్లలోకి చేరుతున్నందున డ్రైనేజీలు వెడల్పు చేసి తమకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



• సరదాగా కాసేపు..

వేసవి వస్తే పిల్లలకు పండగే. ఇక నీటిలో ఆటలాడటమంటే ఎంతో సరదా. అయితే నదిలో, సముద్రంలో దిగుతుంటే పెద్దలు కంగారుపడతారు. వారిని అడ్డుకుంటారు. అయితే మత్స్యకార పిల్లలకు ఆ సమస్య లేదు. వారికి ఈత బాగా రావడంతో ఎక్కువగా గోస్తనీ నదిలో ఆటలాడుతూ కేరింతలు కొడుతూ సందడి చేస్తున్నారు. చిన్న తెప్పలాంటి వాటిపై ఎక్కి నదిలో తిరగడం, స్నానాలు చేయడం, చేపలు పట్టడం చేస్తూ ఉత్సాహంగా గడుపుతున్నారు. – భీమునిపట్నం

